AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com






నగరంలోని మెడికల్ కళాశాలలో మంగళవారం 'ఫోరెన్సిక్ మెడిసిన్ డే' నిర్వహించారు. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ నాగమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. – అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్


12-5-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## 'నీట్' రద్దు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే..: రామకృష్ణ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** 'నీట్' రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఆయన మంగళవారం స్పందించారు. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని బొబ్బిలి రామకృష్ణ అన్నారు. దీనికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ.. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలన్నారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని ప్రశ్నించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.



## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు..


**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ వై. విశాల, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఆర్.బాలాజీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు అరగంట ముందుగా హాజరు కావాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు అనుమతించబడవని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.




## జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు ఇందూరు క్రీడాకారులు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు జరుగగా.. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ శ్రీనివాస్ తెలిపారు. పాల్గొన్న వారిలో సెడ్విన్ 47 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్, దేవిశ్రీ 45 కిలోల విభాగంలో బ్రాంజ్ మెడల్, కూన కేదార్ 47కిలోల విభాగంలో బ్రాంజ్ మెడల్, జవ్వాద్ ఖాన్ 63కిలోల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. వీరు నలుగురు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.



ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి డివిజన్ పరిధిలోని జక్రాన్‌పల్లిలో సోలార్ విద్యుత్ ప్లాంట్ అందుబాటులోకి తెచ్చింది. ఇది రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రభుత్వరంగ సోలార్ ప్లాంట్ కావడం విశేషం.

– అక్షరటుడే, భీమ్‌గల్

- జక్రాన్‌పల్లిలో సౌర కాంతులు!
- రాష్ట్రంలోనే తొలి ప్రభుత్వ సోలార్ ప్లాంట్ ప్రారంభం
- టీజీఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.2.81 కోట్లతో ఏర్పాటు
- 0.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి.. గ్రిడ్‌కు అనుసంధానం
- ప్లాంట్‌ను పరిశీలించిన సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి

# గ్రీన్ ఎనర్జీ దిశగా అడుగులు..

ఇప్పటివరకు కేవలం గృహాలు, పరిశ్రమల అవసరాలకే పరిమితమైన సౌర ఫలకాలను, ఇప్పుడు నేరుగా విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలోనే ఏర్పాటు చేసి గ్రిడ్‌కు అనుసంధానించారు. ఇలా జక్రాన్‌పల్లి సబ్‌స్టేషన్‌ను రూపొందించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ఇటీవల సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) వరుణ్ రెడ్డి స్వయంగా పరిశీలించి ప్రారంభించారు.

### అత్యాధునిక సోలార్ పీవీ ప్యానెళ్లు..

సుమారు రూ.2.81 కోట్ల టీజీఎన్పీడీసీఎల్ సొంత నిధులతో ఈ 0.8 మెగావాట్ల (800 కిలోవాట్లు) ఏసీ సోలార్ ఫొటో వోల్టాయిక్ ప్లాంట్‌ను జక్రాన్‌పల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్మించారు. అత్యాధునిక సోలార్ పీవీ ప్యానెళ్లు, ఆన్‌గ్రిడ్ ఇన్వర్టర్లు, స్టెప్‌అప్ ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని రూపొందించారు.

### సోలార్ సబ్‌స్టేషన్ ప్రత్యేకతలు ఇవే..

- వినూత్న మాడ్యూల్ మౌంటింగ్ స్ట్రక్చర్లతో ప్యానెళ్ల ఏర్పాటు
- వీసీబీ, ఏసీడీబీ వంటి ఆధునిక మీటరింగ్ వ్యవస్థలు
- కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పాటు ప్రభుత్వానికి విద్యుత్ కొనుగోలు ఖర్చు ఆదా
- జిల్లాలోనే మొట్టమొదటిగా ప్రారంభమైన ఈ భారీ సోలార్ ప్లాంట్
- భవిష్యత్తులో ఇతర ప్రాంతాల్లోనూ ఇటువంటి ప్రాజెక్టుల ఏర్పాటుకు దిక్సూచిగా మారే అవకాశం

ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నేరుగా సబ్‌స్టేషన్ ద్వారా గ్రిడ్‌కు పంపిస్తారు. దీనివల్ల స్థానిక ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య తగ్గడమే కాకుండా, నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వీలుంటుందని అధికారులు తెలిపారు.

### నిరంతర సరఫరా ..

ప్లాంట్‌ను సందర్శించిన అనంతరం సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. వినియోగదారులకు కాలుష్య రహిత, చౌకైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలోనే ఒక విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టిన తొలి సోలార్ ప్రాజెక్టు ఇది అని అన్నారు. ప్లాంట్ పనితీరును రిమోట్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించామన్నారు. గరిష్ఠ స్థాయిలో ఉత్పత్తి సాధించి గ్రిడ్‌కు బలం చేకూర్చాలని అని ఆయన సూచించారు.

## ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఒకటి, రెండు సబ్జెక్టులలో తప్పిపోయినంత మాత్రాన అనవసర ఆందోళనకు గురి కావద్దని సూచించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మరో మూడు వారాల వరకు సమయం మిగిలి ఉన్నందున ఏకాగ్రతతో శ్రద్ధగా చదువుకోవాలని, శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే, తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషిస్తారని అన్నారు. జీవితంలో ఓటములు ఎదురవడం సహజమేనని, వాటిని భవిష్యత్తు విజయాలకు సోపానాలుగా మార్చుకోవాలని హితవు పలికారు. ఉన్నత స్థానాలకు చేరాలంటే షార్ట్ కట్స్ అంటూ ఏవీ ఉండవని, విద్యార్థి దశలో కష్టపడితే జీవితం అంతా సుఖ సంతోషాలతో గడపవచ్చని మార్గనిర్దేశం చేశారు. సప్లిమెంటరీలో మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సెల్ ఫోన్లను కొన్నాళ్లపాటు పక్కన పెట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం శంకర్ భవన్ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాల్లో అందిస్తున్న తర్ఫీదు గురించి ఆరా తీశారు. విద్యా శాఖ అధికారి అశోక్, ఎంఈవోలు సాయిరెడ్డి, అరవింద్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయన్న తదితరులు ఉన్నారు.

## ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించాలి..

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు నూతనంగా ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డిలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 ప్రకారం సర్వీస్ రూల్స్ రూపొందించి, ఖాళీగా ఉన్న 600కు పైగా ఎంఈవో పోస్టులు, 80 డిప్యూటీ ఈవో క్యాడర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. మోడల్, ఎయిడెడ్ పాఠశాలల టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో పారదర్శకత పాటించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం బేసిక్ పే, సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ కలీమొద్దీన్, పంపరి ప్రవీణ్ కుమార్, వేణుగోపాల్, కాజామోహినుద్దీన్ పాల్గొన్నారు.







## నిజామాబాద్‌లో విషాదం.. వైద్యుల నిర్లక్ష్యానికి పసికందు బలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** తల్లిదండ్రులు తమ తమ బిడ్డకి చిన్నపాటి అస్వస్థత చేస్తే, నయమవుతుందన్న నమ్మకంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. కానీ, ఆ నమ్మకమే వారి పాలిట శాపమైంది. వైద్యుల నిర్లక్ష్యం ఆ దంపతుల సంతానాన్ని చిదిమేసింది. జక్రాన్‌పల్లి మండలం పడకల్ తండాకు చెందిన శిరీష, నరేష్ దంపతుల కుమారుడు నిక్షిత్ (16 నెలలు). సోమవారం రాత్రి బాబుకు వాంతులు, విరేచనాలు కావడంతో నీరసించిపోయాడు. దీంతో జిల్లా కేంద్రంలోని సెక్యూర్ చైల్డ్ కేర్ ఆస్పత్రికి తరలించారు. బాబును పరీక్షించిన వైద్యులు.. రక్తహీనత ఉందని, హార్ట్ బీట్ తక్కువగా ఉందని చెబుతూ చికిత్స ప్రారంభించారు. చికిత్స పొందుతున్న క్రమంలో బాబు ఒంటిపై దద్దుర్లు రావడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వైద్యులను ప్రశ్నించారు. వారు గ్లూకోజ్ సెలైన్‌లో ఇంజెక్షన్ ఇచ్చి ఎక్కించారు. అయితే మంగళవారం ఉదయం ఎంఆర్ఐ స్కాన్ తీయించి తీసుకురాగానే బాబు పరిస్థితి విషమించింది. కాసేపటికే బాబు కన్నుమూశాడని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. "మా బిడ్డను అన్యాయంగా చంపేశారు" అంటూ ఆస్పత్రి ముందు బంధువులు, తండా వాసులు ఆందోళనకు దిగారు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాబు తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాబు మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

## కామారెడ్డిలో హైవే పక్కన బస్టాండ్ ఏర్పాటు చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో హైవే పక్కన బస్టాండ్ ఏర్పాటు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి.. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి పట్టణ జనాభా లక్షకు పైగా ఉందని, పట్టణం నలువైపులా వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్ విస్తీర్ణం చాలా తక్కువ అని, దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. 44వ జాతీయ రహదారి విస్తరణతో ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నాగ్‌పూర్, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కామారెడ్డి పట్టణంలోకి రావడం లేదని మంత్రికి వివరించారు. నాన్‌స్టాప్ బస్సులు పట్టణంలోకి రాకపోవడంతో ప్రయాణికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆర్టీసీకి అనుకూలంగా ఉన్న ఈ స్థలంలో నాన్‌స్టాప్ బస్సుల కోసం బస్టాండ్ ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఉత్తర తెలంగాణలో కీలకమైన కామారెడ్డి నుంచి ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు సులభంగా వెళ్లేందుకు హైవే పక్కన బస్టాండ్ అత్యవసరమని, వెంటనే చర్యలు చేపట్టాలని గడ్డం చంద్రశేఖర్ రెడ్డి కోరారు.



## తునికాకు కల్లాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్లపేట తునికాకు కల్లాన్ని ఎల్లారెడ్డి ఎఫ్ఆర్వో రమేష్ మంగళవారం పరిశీలించారు. తునికాకు సేకరణ చేసే ప్రజలు వన్య ప్రాణులు, ఎండ వేడిమి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాత తునికాకు డబ్బులు రాని రైతుల సమస్యను సర్పంచ్ వినోద్ రాజా గౌడ్ ఎఫ్ఆర్ఓ దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు రావాల్సిన బకాయి డబ్బులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎఫ్ఆర్వో రమేష్ రైతులకు బకాయిలు వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు యాదవ్, వార్డ్ సభ్యుడు సాయిరాం, డీఆర్వో పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన




**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డేలి గ్రామంలో రైతులు మంగళవారం సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. రైతు పుప్పాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. తమకు అవసరం లేని నానో యూరియా లిక్విడ్ అంటగట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తీసుకున్న లిక్విడ్ మిగిలిపోయి ఉందన్నారు. మూడు సంచుల ఎరువులు తీసుకుంటే ఒక లిక్విడ్ బాటిల్ తీసుకోవాలనే కండీషన్ పెట్టడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లిక్విడ్ తీసుకోవడం మూలంగా రైతులపై రూ.200 అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే మందుల రేట్లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. 10 సంచులకు ఒకటి ఇస్తే తీసుకుంటామని తెలిపారు. రైతుల ఆరోపణలపై ఏవో నిశితను వివరణ కోరగా.. రైతులకు అనవసరంగా నానో యూరియా ఇవ్వొద్దని చెప్పామన్నారు. సొసైటీ వాళ్లను అడిగితే రైతులు లిక్విడ్ తీసుకోకుంటే స్టాక్ రిటర్న్ చేస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రుక్మయ్య, అర్జున్, సురేందర్, అశోక్, ప్రవీణ్, భారత్, చందు, గణేష్, రాము, ఆంజనేయులు, వినయ్, సురేందర్ పాల్గొన్నారు.

జాతీయ జనగణనలో కీలకమైన గృహజాబితా సేకరణ ప్రక్రియ సోమవారం నుంచి కామారెడ్డి జిల్లాలో ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా ఎన్యుమరేటర్లు గడపగడపకు వెళ్లి వివరాలను డిజిటల్‌గా 'హెచ్ఎల్‌పీసీ' మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. జూన్ 9 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. – అక్షరటుడే, ఎల్లారెడ్డి



# జోరుగా ఇంటింటి సర్వే

■ ప్రతి ఇంట్లో 33 రకాల వివరాల సేకరణ ■ సిబ్బందికి సహకరించాలని కోరుతున్న అధికారులు ■ అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచన

కామారెడ్డి జిల్లాలో మొత్తం 2.65 లక్షల గృహాలు ఉండగా, ఇందుకోసం 1,954 మంది ఎన్యూమరేటర్లు పనిచేస్తున్నారు. వీరి విధులను పర్యవేక్షించేందుకు 310 మంది సూపర్‌వైజర్లను నియమించారు. మొదటి రెండు, మూడు రోజులు ఇళ్ల మ్యాపింగ్, నంబర్లు కేటాయించే పనులు చేస్తారు. జనగణనలో భాగంగా గత నెల 26వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు స్వీయగణనకు అవకాశం కల్పించగా, జిల్లాలో 80శాతం ఇళ్లలో స్మార్ట్ ఫోన్లు వినియోగించే వారు ఉన్నప్పటికీ ఈ నెల 9వ తేదీ వరకు కేవలం 9,631 మంది మాత్రమే స్వీయగణన పూర్తి చేశారు.

### కొన్ని గ్రామాల్లో శతశాతం..

కొన్ని పల్లెలు శత శాతం పూర్తి చేస్తే, మరికొన్ని గ్రామాల్లో స్పందన కరువైంది. ప్రతి ఇంటి నిర్మాణ స్వభావం, కుటుంబీకులు, కొన్ని వసతులు (తాగునీరు, విద్యుత్, శౌచాలయాలు, ఇతర) ఇలా 33 రకాల వివరాలను 'హెచ్ఎల్‌పీసీ' యాప్‌లో నమోదు చేస్తారు. ఆయా వీధులో ఉన్న ఆలయాలు, మసీదులు, చర్చిలు, రహదారులు, ప్రధాన స్థలాలను పొందుపరుస్తారు. జూన్ 9 వరకు ఈ ప్రక్రియ సాగుతుంది. అధికారులకు బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ముఖ్య గణాం కాధికారిగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అదనపు ముఖ్య గణాంకాధికారిగా, డీఆర్వో గణాంకాధికారిగా వ్యవహరిస్తారు. సీపీవో, డీఈవో, జెడ్పీ సీఈవో, డీఎంఈవోలు నేతృత్వ అధికారులుగా, పురపాలకాల కమిషనర్లు, మండల స్థాయిలో తహసీల్దార్లు ఛార్జ్ అధికారులుగా, ఎంపీడీవో, అటవీశాఖ సిబ్బంది టాస్క్‌ఫోర్స్ అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### గృహాల్లో 33 రకాల వివరాల సేకరణ..

ఈ సందర్భంగా గృహజాబితా సేకరణలో ప్రతి ఇంటి నిర్మాణ స్వభావం, కుటుంబీకుల వివరాలు, తాగునీరు, విద్యుత్, శౌచాలయాలు సహా మొత్తం 33 రకాల వివరాలను ఎన్యూమరేటర్లు 'హెచ్ఎల్‌పీసీ'



మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆయా వీధుల్లో ఉన్న ఆలయాలు, మసీదులు, చర్చిలు, రహదారులు, ప్రధాన స్థలాలను కూడా యాప్‌లో పొందుపరుస్తున్నారు. జూన్ 9 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. సర్వేను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు. సర్వే సిబ్బందికి సరైన వివరాలు ఇవ్వాలని, దీంతో ఎలాంటి నష్టం ఉండదని చెబుతున్నారు. ఎన్యుమరేటర్లు సైతం పక్కాగా సర్వే చేయాలని, వివరాల నమోదులో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఏమైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.

### తస్మాత్ జాగ్రత్త..

జనగణన ముసుగులో కొందరు ఇళ్లలోకి వచ్చి వివరాలు సేకరించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గణనకు వచ్చే వారు నిజమైన అధికారులేనా అని నిర్ధారించుకోవడం తప్పనిసరి అన్నారు. ప్రభుత్వం ప్రతి ఎన్యూమరేటర్‌కు ప్రత్యేక గుర్తింపు కార్డును జారీ చేసిందని తెలిపారు. వివరాలు చెప్పే ముందు గుర్తింపు కార్డును తనిఖీ చేసి, వారు ధరించి ఉన్నారో లేదో చూడాలని అధికారులు సూచించారు. ఈ విషయంలో అందరూ జాగ్రత్త వహించాలని కోరారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్సై యాసిర్ అరాఫత్ అన్నారు. ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో మంగళవారం 'మన ఊరు -మన భద్రత-మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నేరాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు ద్వారా నేరస్థులను సులభంగా పట్టుకోవడం వీలవుతుందన్నారు. సైబర్ నేరాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్లు, 'అమృత్' పనుల పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, 2వ వార్డులో జరుగుతున్న అమృత్ పథకం పనులను మున్సిపల్ కమిషనర్ జె. జగ్జీవన్, డీసీసీ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, కౌన్సిలర్ చంద్రయ్య మంగళవారం పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న జనగణన సర్వేను ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు 'హెచ్ఎల్‌పీసీ' యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలు సర్వేకు సహకరించి సరైన సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## బ్రాహ్మణపల్లిలో ఈజీఎస్ పనుల పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఈజీఎస్ పనులను ఎంపీడీవో తాహెరా బేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి వారి భాగస్వామ్యం మరింత పెంచాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. జులై 1వ తేదీ నుంచి కొత్త ఉపాధి చట్టం అమలులోకి రానున్న నేపథ్యంలో ఈజీఎస్ పనుల ప్రాధాన్యతను అధికారులు కార్మికులకు వివరించారు. పనిప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ వంటి మౌలిక సదుపాయాలను అధికారులు పరిశీలించారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గోవధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం గోవధ చట్టాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1977లో తీసుకొచ్చిన గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణల్లో ఉన్న ఆలయ భూములకు వెంటనే విముక్తి కల్పించాలన్నారు. ప్రతి జిల్లాలో కనీసం 10 ఎకరాల స్థలంలో ప్రభుత్వమే గోశాలలను ఏర్పాటు చేయాలని, చట్టవిరుద్ధంగా నడుస్తున్న గోవధశాలలను తక్షణమే మూసివేయించాలని కోరారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, గో ఆధారిత వ్యవసాయదారులకు సబ్సిడీలు ఇవ్వాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ కామారెడ్డి జిల్లా గోరక్ష ప్రముఖ్ తులసీదాస్, శ్రీ ప్రఖండ సంఘటన మంత్రి వినోద్ కుమార్, ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు నవీన్, హరిబాబు, రాహుల్, హర్ష, పురుషోత్తం, యాదగిరి, విద్యాసాగర్, రాజ్ కుమార్, నవీన్ పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాపై చీతా ఫోర్స్ ఉక్కుపాదం.. రెండు భారీ లారీలు సీజ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై చీతా ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. వరుసగా దాడులు చేస్తూ ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తోంది. సీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ చురుకుగా స్పందిస్తూ జిల్లావ్యాప్తంగా దాడులు చేస్తోంది. ఆర్మూర్, మోర్తాడ్ ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ప్రాంతాలపై సీసీఎస్ ఏసీపీ ఇన్‌ఛార్జి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు భారీ లారీలను చీతా ఫోర్స్ సిబ్బంది గుర్తించారు. వాటిని వెంటనే స్వాధీనం చేసుకొని డ్రైవర్లు, సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మోర్తాడ్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చీతా ఫోర్స్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పట్టుబడ్డ లారీలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లుతుందని చీతా ఫోర్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

## గంధపు చెట్లపై ఆశతో భూ యజమాని హత్య.. కౌలురైతుకు జీవిత ఖైదు

**అక్షరటుడే, కామారెడ్డి :** ఆస్తిపై ఆశతో కౌలు రైతు భూ యజమానిని దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో భిక్కనూరు పోలీసుల దర్యాప్తుతో నిందితుడికి జీవిత ఖైదు పడింది. కాట్రియాల్ గ్రామానికి చెందిన కోరే సాయి జగదీష్ ముంబయిలో ఉంటున్నాడు. అన్న కూతురు పెళ్లి కోసం సొంతూరు వచ్చి తన 2 ఎకరాల భూమి అమ్మాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ భూమిని పదేళ్లుగా కౌలుకు తీసుకుని గంధపు చెట్లు పెంచుతున్న కుర్మ సాయిలు అడ్డుపడ్డాడు. భూమి అమ్మితే భవిష్యత్తులో వచ్చే లాభం పోతుందని భావించిన సాయిలు పథకం ప్రకారం జగదీష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. 2022 నవంబర్ 13న మందు తాగుదామని నమ్మించి బైక్‌పై తీసుకెళ్లాడు. మద్యం తాగిన తర్వాత జగదీష్ తలపై బండరాయితో కొట్టి చంపేశాడు. ఆధారాలు లేకుండా చేసేందుకు మృతదేహంపై దుస్తులు వేసి, మద్యం పోసి నిప్పంటించాడు. జగదీష్ అన్న కాసు యాదగిరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన భిక్కనూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సరైన సాక్ష్యాలు సేకరించి నిందితుడు కుర్మ సాయిలును అరెస్ట్ చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ నిందితుడు సాయిలుకు జీవిత ఖైదుతో పాటు రూ.15 వేలు జరిమానా విధించారు. కేసు దర్యాప్తు చేసిన అధికారులను ఎస్పీ అభినందించారు.

## కామారెడ్డిలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేనీ సందీప్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ పదవిని అడ్డుపెట్టుకుని తన కుమారుడిపై నమోదైన కేసులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న అధికారాన్ని ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసును పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. హనీట్రాప్ కేసుల పేరుతో అసలు అంశాన్ని మళ్లించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దిష్టిబొమ్మ దహనం సమయంలో పోలీసులు అడ్డుకునే యత్నం చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కామారెడ్డి రూరల్ అధ్యక్షుడు రాజా గౌడ్, రామాగౌడ్, గుడుగుల శ్రీనివాస్, రామ్మోహన్, కాళ్ల గణేష్, అజ్మత్, ఆనందరావు, గ్యార సాయిలు, అంజద్, లడ్డు, కళ్లెం సత్యం తదితరులు పాల్గొన్నారు.